# సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 8 । నవంబర్ । 2024




**నమ్మండి.. ఇది హార్సిలీహిల్స్!**
పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఎక్కడిచెత్త అక్కడే నిల్వ ఉంటూ దుర్గంధం వెదజల్లు తోంది. కూటమి ప్రభుత్వం హార్సిలీహిల్స్‌ను పట్టించుకోవడం పూర్తిగా వదిలేసింది. -8లో



**తెల్లవారితే పెళ్లిరోజు..**
తెల్లారితే ఆ దంపతుల పెళ్లి రోజు. ఈ నేపథ్యంలో పుట్టింటి నుంచి కొత్త దుస్తులు తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. -8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.230 | రూ.280 |
| రెండోరకం | రూ.140 | రూ.220 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 236 మెట్రిక్ టన్నులు



# రెచ్చిపోయిన రెడ్డెమ్మ!

కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి హుందా తనం కోల్పోయారు. ఒక ప్రజాప్రతిని ధిగా గౌరవంగా అడుగుపెట్టాల్సిన సభలో కౌరవ సేనతో వచ్చి సభా మర్యాదలను పట్టపగలే మంటగలి పారు. కుర్చీలాట ఆడనంటూనే కుర్చీ కోసం మారాం చేసి పరువు పోగొట్టు కున్నారు. వేదికపై సీటు ఎందుకు వేయలేదంటూ మేయర్‌నే గద్దిస్తూ మరో మెట్టుకు జారిపోయారు. తోటి కార్పొరేటర్‌ను 'నువ్వు' అంటూ ఏకవచనంతో సంభోదిస్తూ సంస్కారాన్ని కోల్పోయారు. 'మహిళ' అంటూనే ..తోటి మహిళలను కించపరుస్తూ మరింతగా దిగజారిపో యారు. గురువారం కడప నగర సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవి వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మిగిలిపోనుంది.

**హుందా.. అసలుందా..**
- సొంత అజెండాతో రాద్ధాంతం సృష్టించిన కడప ఎమ్మెల్యే
- హోదా మర్చిపోయి డమ్మీగా మారిన కమిషనర్
- మేయర్ ఆదేశాలను అమలు చేస్తూ సభను ఆర్డర్‌లో పెట్టడంలో విఫలం

సాక్షి ప్రతినిధి, కడప: ఆమె ఎమ్మెల్యే. కడప నియోజ కవర్గ ప్రజల ప్రజాప్రతినిధి. బాధ్యతగా వ్యవహ రించి స్థానికంగా ఉన్న సమస్యలను మున్సిపల్ కౌన్సిల్‌లో పరిష్కరించేందుకు చొరవ చూపెట్టాలి. సాధ్యం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకె ళ్లి కౌన్సిల్‌కు తోడ్పాటు ఇవ్వాలి. అలా వ్యవహరిస్తే మరింత పేరు లభించేది. కానీ ఆమె అందుకుభి న్నంగా ప్రదర్శించారు. కౌన్సిల్‌లో ఉన్న కార్పొరేట ర్లంతా (ఒక్కరు మినహా) సమావేశం అజెండా కొన సాగించాలని కోరినా తాను పట్టిన కుందేలికి మూడే కాళ్లు అన్నట్లుగా వ్యవహరించారు. హుందాతనం మర్చిపోయి కార్పొరేటర్లతో గొడవకు దిగారు.



నగరపాలక సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలను పక్కనబెట్టి వ్యక్తిగత ఆరోపణలకు దిగిన ఎమ్మెల్యే మాధవిరెడ్డి

మేయర్ చైర్‌కు తగ్గట్లుగా వేదికపై సీటు ఎందుకు వేయలేదంటూ నానా రభస చేశారు.

- మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్ సుప్రీం. ప్రభుత్వ నిబంధనలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తు న్నాయి. ఎమ్మెల్యే కేవలం కౌన్సిల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలు మాత్రమే. కానీ ఎమ్మెల్యే మాధవి తీరు 'అధికారం మాదే.. మా ఇష్టం వచ్చినట్లు వ్యవహరి స్తాం' అన్నట్లు ఉంది. కార్పొరేషన్ సమావేశానికి వస్తున్న ఆమె వాహనానికి ముందు వైపు స్కూటర్ ర్యాలీతో పాటు వందలాది మంది అనుచరులతో ప్రాంగణానికి చేరుకుంది. పైగా వచ్చిన అనుచరులం దరూ కార్పొరేషన్ కార్యాలయంలోకి పంపించాలని పోలీసులను పట్టుబట్టారు. కౌన్సిల్‌లోకి చేరకున్న అమె నేరుగా మేయర్ పోడియంపైకి వెళ్లి నిల్చొంది. అంతేనా మైకు తీసుకొని రాజకీయ ప్రసంగం మొద లుపెట్టారు. మేయర్‌పై వ్యక్తిగత ఆరోపణలు సంధిం చారు. సీటు మార్చడంపై మేయర్ చైర్ విచక్షణాధికా రాన్ని సైతం ప్రశ్నించారు.

**స్థాయి మర్చిపోయిన కమిషనర్....**
కమిషనర్ మనోజ్‌రెడ్డి స్థాయి మర్చిపోయి కౌన్సిల్ మీట్‌లో ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొ న్నారు. మేయర్‌తోపాటు కమిషనర్ తన సీటులో ఆశీనులై, చైర్ నుంచే ఆదేశాలు ఇవ్వాల్సింది పోయి, ఎమ్మెల్యే మాధవి రెడ్డి నిలబడితే, అక్కడికే వెళ్లి కమిషనర్ కూడా నిలుచుండిపోయారు. ఈ దృ శ్యం అటు కార్పొరేటర్లకు, ఇటు మీడియా ప్రతినిధు లకు వింతగా కన్పించింది. కౌన్సిల్‌లో మేయర్ ఆదే శాలను అమలు చేయాల్సిన బాధ్యత కమిషనర్‌ది.



పోలీసులను తోసుకుంటూ వస్తున్న టీడీపీ కార్యకర్తలు

మేయర్ ఆదేశాలను సైతం అమలు చేయకపోగా తాను నిమిత్తమాత్రుడినే అన్నట్లుగా ఉండి పోయారు. తాత్కాలిక వాయిదా తర్వాత సమా వేశం కొనసాగించాలని మేయర్ సురేష్‌బాబు ఆదే శించినా డీఎస్పీ శాంతిభద్రతలను కట్టడి చేయ లేమంటున్నారని చెప్పుకురావడం గమనార్హం. 50మంది కార్పొరేటర్లతో నిర్వహిస్తున్న సమావేశం లో శాంతి భద్రతలు కట్టడి చేయలే మని డీఎస్పీ వెల్లడిస్తే, వెంటనే ఎస్పీ ఆపై అధికారులకు కమిష నర్ ఫిర్యాదు చేయాల్సిందిపోయి, డీఎస్పీ మాట లను మేయర్‌కు వివరిస్తూ పోస్టుమెన్ జాబ్ చేశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**కార్పొరేషన్‌పై ఎమ్మెల్యే మాధవి దండయాత్ర**

కడప కార్పొరేషన్: కడప కార్పొరేషన్‌పై టీడీపీ ఎమ్మెల్యే మాధవి దండయాత్ర చేశారు. మందీ మార్బలంతో ర్యాలీగా వచ్చి సర్వసభ్య సమావేశం లో రచ్చ రచ్చ చేశారు. తన కుర్చీని మేయర్‌తో సమానంగా పైన వేయకుండా, కార్పొరేటర్లతో పాటు కింద వేసిన విషయాన్ని తెలుసుకున్న ఆమె.. ముందస్తు వ్యూహం ప్రకారం వందలాది మంది టీడీపీ కార్యకర్తలతో వచ్చి సర్వసభ్య సమావేశంలో రభస సృష్టించారు. సభ లోపలికి ప్రవేశించగానే ఆమెకు కేటాయించిన కుర్చీలో ఆశీనురాలు కాకుం డా వేదికపైకెక్కి నిల్చొన్నారు. తనకు మాట్లాడేం దుకు అవకాశమివ్వాలని మేయర్‌ను కోరగా ఆయన సమ్మతించారు. ఇదే అదనుగా భావించిన ఎమ్మెల్యే రాజకీయ విమర్శలతో పాటు వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీంతో ఎజెండాపై చర్చిం చాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అడ్డు తగిలారు. అయినా ఆమె వినిపించుకోలేదు... సబ్జెక్టు మీదే మాట్లాడాలని కార్పొరేటర్ అరీఫుల్లా బాషా చెప్పగా 'నీవు కూర్చో...నేను మాట్లాడుతున్నా...నీకు అవకాశం ఇచ్చినప్పుడు మాట్లాడు' అంటూ ఏకవ చనంతో సంభోదించారు. 'ప్రజలు నాకు అంతకం టే పెద్ద కుర్చీ ఇచ్చారు...మీకు పోలీస్ రక్షణ కావా లా...దేనికి' అని వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేట ర్లనుద్దేశించి దురుసుగా ప్రశ్నించారు. ఈ క్రమంలో సమావేశం గందరగోళంగా మారడంతో మేయర్ సురేష్ బాబు సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలా..**

తిరుపతి కార్పొరేషన్‌లో ఇలాంటి ఘటనే ఉత్పన్నం అయ్యింది. తిరుపతి ఎంపీ గురుమూర్తి మేయర్ శిరీషాతో పాటుగా వేదిక మీద ఆశీనుల య్యారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైన ఆ సమావేశంలో బీసీ మహిళ మేయ ర్‌గా ఉన్నారు. ఆమె గౌరవానికి భంగం లేకుండా మనమంతా సభ్యుల స్థానంలో ఆశీనులై అవసర మైన సలహాలు, సూచ నలు చేద్దామని చెప్పుకొ చ్చారు. ఎంపీ సైతం ఎమ్మెల్యే అభ్యర్థనను మన్నించి సభ్యుల స్థానంలో ఎక్స్‌అఫిషియో మెం బర్ స్థానంలో కూర్చొండిపోయారు. అక్కడ అలా జరిగితే.. ఇక్కడేమో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాత్రం తనకు సీటు మేయర్ చైర్ స్థాయిలో ఎం దుకు వేయలేదంటూ గొడవ సృష్టించారు. నిజా నికి ప్రొటోకాల్ అలానే ఉంటే అధికార పార్టీ ఎమ్మెల్యేను విస్మరించే సాహసం అధికారులు చేసే అవకాశం ఉందా? స్థాయి దిగజారి ప్రవర్తించడం ఏమేరకు సబబు అని నగర ప్రజలు చర్చించుకుం టున్నారు. కేటాయించిన సీటులో కూర్చొని సమా వేశం కొనసాగించి ఉంటే మరింత హుందాగా ఉండేదని విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు.



- ప్రజా సమస్యలను చర్చించాల్సిన చోటది... ప్రజాప్రతినిధిగా బాధ్యతగా మెలగాల్సిన వేదికది.. అలాంటి చోట మాధవిరెడ్డి అభాసుపాలయ్యారు. సభలో కమిషనర్ ఏదో చెప్పబోతుండగా కన్నుకొట్టి సైగ చేశారు. దీనిని బట్టి వ్యూహం ప్రకారమే రాద్ధాంతం చేసినట్లు అందరికీ స్పష్టమైంది.

## ఎమ్మెల్యేకు ఎంతో గౌరవం ఇచ్చాం

- కడప మేయర్ కె.సురేష్‌బాబు



కడప కార్పొరేషన్: దేశం లో ఎక్కడా ఏ ఎమ్మె ల్యేకు ఇవ్వని విధంగా కడప ఎమ్మెల్యే మాధవికి తమ పాలకవర్గం ఎంతో గౌరవం ఇచ్చిందని, ఆ గౌరవాన్ని ఆమె కాపాడుకోలేకపోయారని కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు అన్నారు. గురువారం కడప కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబ ర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024 జూలై 4న జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమెను మేయర్‌తో సమానంగా కుర్చీ వేసి కూర్చొబెట్టాము ని, ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత నగరా భివృద్ధి కోసం కలిసి మెలిసి పాటుపడాలని భావిం చామన్నారు. అయితే ఎమ్మెల్యే వైఖరి అందుకు తగి నట్లుగా లేదని, మొదటి సమావేశంలోనే మహిళా కార్పొరేటర్‌ను కించపరిచేలా మాట్లాడి తన అహం భావాన్ని చూపారన్నారు. ఈ ఐదు నెలల కాలంలో ఆమె తమపై, తమ కార్పొరేటర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగారన్నారు. తన ఇంటిపై చెత్త వేయిం చిందని, 8వ డివిజన్ ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి లే అవు ట్‌లో కాలువ ఉందని పట్టుబట్టి ప్రహరీ కూల్చి వేయించారన్నారు. కుటుంబ వ్యవహారాల్లో తలదూర్చి 36వ డివిజన్ ఇన్‌చార్జి రఫీని అరెస్టు చేయించారని, ఇలాంటి వ్యక్తికి అంత గౌరవం ఇవ్వడం సరైంది కాదని భావించి చట్టప్రకారం నడు చుకున్నామన్నారు. ఎమ్మెల్యే నగరపాలక సంస్థలో సభ్యురాలు కాదని, ఎక్స్ అఫిషియో సభ్యురాలు మాత్రమేనని తెలిపారు. అందుకే మేయర్‌కు తప్ప మిగిలిన వారందరికీ జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం కిందనే సీట్లను వేయించామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ సమావేశంలో తాగునీరు, పారి శుద్యం, అభివృద్ధి పనులు వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఎమ్మెల్యే నేనే రాజు, నేనే మంత్రిగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. కర్నూలులో సాక్షాత్తు మంత్రి టీజీ భరత్ కూడా కార్పొరేటర్లతో పాటు కిందే కూర్చొన్న విషయాన్ని ఉదహరించారు. 400 మంది కార్యకర్తలను వెంటేసుకుని వచ్చి నియంతృత్వ ధోరణిలో దౌర్జన్యంగా వ్యవహరిం చడం సరికాదన్నారు. మాకు మనుషులు లేరా....మే మనుకుంటే ఎమ్మెల్యేను కార్పొరేషన్‌లోకి రాకుండా గేటు వద్దే ధర్నా చేసేవారంకదా.. అని తెలిపారు.

## న్యూస్‌రీల్

### డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): డీఎస్సీ (సెకం డరీ గ్రేడ్ టీచర్స్) పరీక్షలకు ఉచిత శిక్షణకు అర్హు లైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తు న్నట్లు అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం(ఏపీ బీసీ స్టడీ సర్కిల్) జిల్లా సంచాలకులు సందప్ప ఒక ప్రకటనలో తెలి పారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1 లక్ష లోపు ఉండి, టీటీసీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మొత్తం 200 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామ ని, 60 రోజులు శిక్షణ కాలం ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఎస్ఎస్‌సీ, ఇంటర్, టీటీసీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, ధృవీకరణపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతపరిచి ఏపీ బీసీ స్టడీ సర్కిల్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం లో ఈ నెల 12 లోపు అందజేయాలన్నారు. వివరా లకు 9885021440, 9989039216 నెంబర్లను సంప్రదించాలన్నారు.

### క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: ముందస్తుగా స్క్రీనింగ్ పరీ క్షలు చేయించుకుని, చికిత్స చేయించుకుంటే క్యాన్సర్‌పై విజయం సాధ్యమని అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొం డయ్య అన్నారు. క్యాన్సర్‌పై అవగాహన దినం ను పురస్కరించుకుని పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల నుండి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 7న ప్రతి సంవత్సరం క్యాన్సర్ అవగాహన కార్య క్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తం గా బృందం చర్చలు, ర్యాలీలు, చైతన్య కార్య క్రమాలు, వ్యక్తిగత కౌన్సిలింగ్‌లు, సామూహిక ప్రేరణ కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన తీసుకువస్తున్నామ న్నారు. మొదటగా ఇంటింటా క్యాన్సర్ వ్యాధిపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం, వ్యాధి లక్షణా లను గుర్తిస్తే పలు దశలలో పలురకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ తర్వాత చికి త్సలు అందజేస్తారన్నారు. జిల్లా అసంక్రమిత వ్యాధుల పోగ్రాం (ఎన్‌సీడీ) అధికారి శివప్రతాప్ మాట్లాడుతూ క్యాన్సర్ అంటువ్యాధి కాదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమా ర్, డీపీఎంఓ రియాజ్ బేగ్, డిప్యూటీ డెమో దేవశి రోమణి, హెల్త్ ఎడ్యుకేటర్‌లు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలి

**కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

కలికిరి: ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయిం చాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హౌసింగ్ అధి కారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల పర్యట నలో భాగంగా గురువారం ఉదయం కలికిరి రెడ్డివారి పల్లి-1 హౌసింగ్ లేఅవుట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో మంజూరైన గృహాలు, నిర్మాణ దశలో ఉన్న, పూర్తిగా ప్రారంభించని గృహాల వివరాలపై ఆరా తీశారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాల ని, అవసరమైన వారికి ఐకేపీ ద్వారా రుణాలు మంజూ రు చేయించాలన్నారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని హౌసింగ్ లే అవుట్ వారిగా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షిం చారు. ఇండ్ల నిర్మాణాలపై హౌసింగ్ సిబ్బందితో ప్రతి రోజూ సమీక్షించాలని ఎంపీడీఓను ఆదేశించారు. విద్యార్థులకు అపార్ ఐడీ, నవశకం పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా, ఆధార్ లింకేజీ, స్కిల్ సెన్సెస్ తదితరాలపై కలెక్టరు సమీక్షించారు. కార్యక్రమంలో మదనపల్లి ఆర్డీఓ రాఘవేంద్ర, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, డీపీఓ బలరామిరెడ్డి, డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ భానుమూర్తి, డీటీ నవీన్, ఎంఈఓ కరీముల్లా పాల్గొన్నారు.

**విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు**
సంబేపల్లె: ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచా లని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం పనికి రాదని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ దరఖా



కలికిరి రెడ్డివారిపల్లి హౌసింగ్ లే అవుట్‌లో హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

స్తులపై సమీక్షించారు. అపార్ ఐడీ ప్రగతిపై ఆరా తీశారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌ను తనిఖీ చేశారు. మోటకట్ల, ప్రకాష్‌కాలనీలో రెవిన్యూకు సంబంధించి పలు సమస్యలపై ఆయన ఆరా తీశారు. యర్రగుంట్ల సమీపంలో నూతనంగా వేసిన సీసీ రోడ్ల నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమం లో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, ఎంపీడీఓ రామచంద్ర, తహ శీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**సోలార్ ప్యానళ్ల ఏర్పాటును ప్రోత్సహించాలి**
రాయచోటి: జిల్లా వ్యాప్తంగా పీఎం సూర్యఘర్ పథ కం కింద ఇండ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటును ప్రో త్సహించాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశిం చారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సూర్యఘర్ అమలుపై జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్ప టి వరకు మొత్తం 837 మంది ఈ పథకం కింద దర ఖాస్తు చేసుకున్నారని అధికారులు కలెక్టర్‌కు వివరిం చారు. ఈ సమావేశంలో ఏపీడీసీఎల్ ఎస్ఈ చంద్రశే ఖర్ రెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, నెడ్ గ్యాప్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్లారెడ్డి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుండా.. కక్ష సాధింపు చర్యలా..?

- బదిలీలతో పోలీస్ అధికారులలో మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు
- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి
- నియంతలా చంద్రబాబు పాలన: వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి

రాయచోటి: ఎన్నికల హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం వాటిని ప్రశ్నించిన వారిపై కక్షసా ధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం రాయచో టిలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరును ఎండగ ట్టారు. గడికోట మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా విలువలను వైఎస్ఆర్‌సీపీ పాటి స్తుందన్నారు. ' రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను, వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే రాష్ట్రంలో ఎక్కడెక్కడో కేసులు పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీల అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. పోలీసులు సివిల్ డ్రస్సులో అర్ధరాత్రి వేళల్లో సోషల్ మీడియా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను అక్రమంగా తీసుకెళ్లడం అన్యాయం. గతంలో టీడీపీ సోషల్ మీడియా అప్పటి ముఖ్యమం త్రి జగన్ పైన, ఆయన కుటుంబంపైన కామెంట్లు పెట్టారు. కానీ గత ప్రభుత్వం ఎలాంటి కక్షపూరిత చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళ లపై దాడులు, అత్తాకోడళ్లపై అత్యాచారం, నందికొ ట్కూరు ఘటన.. లాంటివి అనేకం జరుగుతున్నా వాటిని అరికట్టకుండా వైఎస్ఆర్‌సీపీపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. గాలివీడు మండలానికి చెం దిన హనుమంతరెడ్డి జాడ తెలియక కుటుంబ



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డిలు

సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అతడిని విడుదల చేయాలి. ఐపీఎస్ అధికారుల మనోభావాలు దెబ్బతినేలా బదిలీలు, పోలీసు అధికారులను సస్పెం డ్ చేయడం అన్యాయం. ముందు హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోండి. ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వండి. నాడు నేడు పనులను పూర్తి చేయండి. రైతు లకు పెట్టుబడి నిధి తదితర హామీల గురించి ఆలోచన చేయండి. అమలుకు నోచుకోని పథకాల గూర్చి ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం.' అని శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు.

**సోషల్ మీడియాను టెర్రరిస్టుల్లా చూస్తూ అణగదొక్కుతున్నారు:**
వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియాను ప్రభుత్వం టెర్ర రిస్టుల్లా చూస్తూ అణగతొక్కే ప్రయత్నం చేస్తోందని ఆకేపాటి ఆరోపించారు. ' బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఆరు మాసాలవుతున్నా ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయడం లేదు. కేబినెట్‌లో రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై చర్చించకుండా సోషల్ మీడియాపై కక్ష సాధింపు చర్యలపై చర్చిం చడం దారుణం. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎం త మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారే కానీ అమలు చేయడం లేదు. చంద్రబాబు ప్రజలకు మేలు చేయకపోగా.. గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలాన్ని వెళ్లదీ స్తున్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుం డా బోట్లు, లడ్డు అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. ప్రభుత్వంపైన ప్రధాన సమస్యలు వచ్చినపుడు ప్రజల దృష్టిని వేరే అంశాలపై మరల్చడంలో చం ద్రబాబు సిద్ధహస్తుడు. చంద్రబాబు నియంతలా పాలన కొనసాగిస్తున్నారు. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పైన, వారి కుటుంబ సభ్యుల పైన టీడీపీ సోషల్ మీడియా అసభ్యకరంగా పోస్టులు పెడితే ఆనాడు చంద్రబాబు ఏమీ మాట్లాడలేదు. నేడు టీడీపీ వారిపై వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా అసభ్యకర పోస్టులు పెట్టారన్న నెపంతో అక్రమ కేసులు పెట్టడం సహేతుకం కాదు. వామపక్ష పార్టీలు కూడా ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధమయ్యాయి. అక్రమ అరెస్టులను ఆపకపోతే పోలీస్‌స్టేషన్ల ఎదుట ధర్నాలకు దిగుతాం. వైఎస్ఆ ర్‌సీపీ శ్రేణులకు, సోషల్ మీడియాకు ఎల్లవేళలా తోడుగా పార్టీ అండగా ఉంటుంది. అరెస్టులు చేసినా వెనుకాడం' అని ఆకేపాటి హెచ్చరించారు.

# అంతా గందరగోళం!

- విద్యారంగంలో 'అపార్' కష్టాలు
- బర్త్, పాఠశాల రికార్డులకు పొంతన కుదరని వైనం
- ఇప్పటివరకు జిల్లాలో అంతంత మాత్రంగానే నమోదు
- డేటా రిజెక్ట్ అవుతుండడంతో తలలు పట్టుకుంటున్న అధికారులు

❒ మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నీరుగట్టు వారిపల్లిలోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1008 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు కేవలం 450 మంది విద్యా ర్థుల వివరాలను అపార్ కార్డు జారీకి నమోదు చేశారు. మిగిలిన విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుట్టిన తేదీలలో మార్పులు ఉండడం, ఇంటి పేరులో కరెక్షన్స్ ఉండడం వంటివి సమస్యగా మారింది.

❒ మదనపల్లి పట్టణం జెడ్పీ హైస్కూల్ ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు 1475 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటివరకు 880 విద్యార్థుల వివరాలను అపార్ కార్డు జారీకి నమోదు చేశారు. మిగిలిన విద్యార్థుల వివరాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. సాంకేతిక సమస్యల గురించి తెలియ జేసినా ఉన్నతాధికారులు ఒప్పుకోవడం లేదు.

సాక్షి రాయచోటి: ఆధార్ సంఖ్య అంటే దేశంలో తెలియని ప్రజలు లేరు. అలాగే విద్యార్థులకు యూనిక్ కోడ్ నెంబరు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ (ఆటోమేటెడ్ పర్మ నెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబరు కూడా 12 డిజిట్లతో విద్యార్థులకు ఒక ఐడీ కేటాయిస్తారు. ఒకే దేశం..ఒకే స్టూడెంట్ ఐడీ పేరుతో నూతన జాతీయ విద్యావిధానం-2020 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ అపార్ నెంబరు కేటాయించడానికి ప్రతి విద్యార్థి పేరు, ఇంటి పేరు, పుట్టిన తేది తదితర వివరలను సేకరించి ఆధార్‌కార్డు, యు డైస్‌తో సరిపోల్చాక విద్యార్థికి ఐడీ నెంబరు కేటాయిస్తారు. అలాంటి ప్రక్రియ నేడు ఆధార్ కార్డు నమోదులో జరిగిన పొరపా ట్లతో అపార్ నమోదు సరిపోక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

**దిక్కుతోచని స్థితి..**
జిల్లాలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు సంబంధించి అపార్ వ్యవ హారం కాస్త గందరగోళంగా మారింది. ఒకవైపు ఆధా ర్‌కార్డుల్లో కొంతమేర తేడాలు ఉండడం, సర్టిఫికెట్లు, రికార్డుల్లో ఉన్న తేడాలతో ఎన్‌రోల్ చేయడానికి కుద రడం లేదు. అంతేకాకుండా ఎలాంటి అక్షరదోషా



తంబళ్లపల్లె ఆధార్ సెంటర్‌లో పేర్లలో తప్పులను సరిదిద్దుకునేందుకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

లున్నా అప్‌లోడ్ చేసినా రిజక్ట్ అవుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఇటు విద్యాశాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి ఈ-సేవా కేంద్రాలతోపాటు ఆధార్ సెంటర్ల వద్ద నిరీక్షణ తప్పడం లేదు. ఆధార్ సెంటర్లకు వెళ్లి మార్పులు, చేర్పులు చేసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం మొదట 9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే అనుకున్నా తర్వాత అంద రికీ చేయాలని కేంద్రం భావించడంతో ప్రస్తుతం ప్రతి విద్యార్థికి అపార్ నమోదుకు చర్యలు చేపట్టారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు కూడా వెసులుబాటు కల్పిస్తూ గతనెల 22 నుంచి 25వ తేది వరకు ప్రత్యేక కేంద్రాలు నిర్వహించారు. అయితే ప్రస్తుతం అటు ఆధార్‌లోనూ, ఇటు సర్టిఫికెట్లలోనూ ఒకే పేరు కాకుండా అక్షరాల్లో తప్పులు ఉండడంతో ఆయా విద్యార్థుల పేర్లు అపార్‌లో ఎన్‌రోల్ చేసేం దుకు ఇబ్బందిగా మారింది.

**ఇప్పటివరకు సగం మంది విద్యార్థులకు మాత్రమే నమోదు**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ వ్యవహారం లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 55.65 శాతం మాత్రమే నమోదు కాగా, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వారికి సంబంధించి 44.35 శాతం మాత్రమే నమోదు కనిపిస్తోంది. అయితే విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని త్వరిత గతిన చేసేందుకు తమవంతుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కూడా ప్రత్యేక దృష్టి సారించి విద్యాశాఖ అధికారు లతో ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ ఎన్‌రోల్‌మెం ట్ వేగంగా నిర్వహించేందుకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు: **2,200**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు: **1,38,602**

ప్రైవేటు పాఠశాలలు: **543**

అందులో చదివే విద్యార్థుల సంఖ్య: **1,10,475**

ఇప్పటివరకు అపార్ నమోదు శాతం:

ప్రభుత్వ పాఠశాలల్లో: **55.65 %**

ప్రైవేటు పాఠశాలల్లో: **44.35%**

## బహిరంగ వేలంలో రూ.2లక్షల ఆదాయం



ఏపీఎస్‌బీసీఎల్ మద్యం డిపోలో బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

**మదనపల్లె :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌బీసీఎల్) మదనపల్లె డిపోలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల్లో ప్రభుత్వానికి రూ.2లక్షల 2వేల 635 ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ ఆదేశాలు, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించి, స్వాధీనం చేసుకున్న ఫ్రీజర్స్, ఇన్వర్టర్ విత్ బ్యాటరీస్, క్యాష్‌చెస్ట్, స్కానర్స్, కౌంటింగ్ మెషిన్లను గురువారం డిపో ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించామన్నారు. వీటి ద్వారా వచ్చిన ఆదాయం రూ.2లక్షల 2వేల 635 రూపాయలను కార్పొరేషన్ ఖాతాకు జమ చేస్తున్నట్లు చెప్పారు. వేలంపాటల్లో అసిస్టెంట్ మేనేజర్ ఆదికేశవులు నాయుడు, సీఐ ప్రశాంత్‌విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## 26న రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్‌ల ర్యాలీ



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, నేతలు

**రాయచోటి అర్బన్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న రాయచోటిలో ఆల్ ట్రేడ్ యూనియన్‌లు, అఖిలపక్ష రైతు సంఘాలు భారీ ర్యాలీ, సభను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సీఐటీయూ నేతలతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి రద్దు చేయించుకున్నట్లుగానే కార్మికులు పోరాడి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, నాయకులు భాగ్యలక్ష్మి, ఓబులమ్మ, మెహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.



### తెల్లవారితే పెళ్లిరోజు..
# అంతలోనే మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ దంపతుల మృతి
- నేడు పెళ్లిరోజు
- పుట్టింటి నుంచి కొత్త దుస్తులు తీసుకొస్తుండగా దుర్ఘటన




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ శివశంకర్, శైలజ

**వల్లూరు :** ఆ దంపతులకు పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. ఈనెల 8వ తేదీ శుక్రవారం వారి పెళ్లి రోజు. ఈ నేపథ్యంలో పుట్టింటి నుంచి కొత్త దుస్తులు తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటన కడప - తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరులోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా..

కడప నగరంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన జానా శివ శంకర్(40) భాకరాపేటలో ఏపీఎస్పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆయన గురువారం తన సతీమణి శైలజ(34)తో కలిసి ద్విచక్ర వాహనంలో కమలాపురం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. తిరిగి కడపకు వస్తుండగా వల్లూరు సమీపంలో కడప వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర రక్తస్రావం కావడంతో శైలజ అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన శివ శంకర్‌ను చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతులకు 8 సంవత్సరాలు, 12 సంవత్సరాల వయసు గల ఇద్దరు పిల్లలున్నట్లు స్థానికులు తెలిపారు. శివ శంకర్, శైలజ దంపతులకు శుక్రవారం పెళ్లి రోజు కావడంతో ఆమె అమ్మగారింటి ఆహ్వానం మేరకు వెళ్లి వారు పెట్టిన కొత్త దుస్తులు తీసుకుని తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. కొత్త దుస్తులతో సంతోషంగా పెళ్లిరోజును జరుపుకోవాల్సిన దంపతులు అర్ధంతరంగా తనువు చాలించడం అందరినీ కంట తడి పెట్టించింది. సంఘటన స్థలంలో పడి ఉన్న కొత్త దుస్తులతో కూడిన బ్యాగును చూసిన వారి హృదయాలు బరువెక్కాయి.

## ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన యువతి నగీనా

**మదనపల్లె :** ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన నౌషాద్, భాను దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయికి వివాహం కాగా, చిన్నకూతురైన షేక్ నగీనా (22) ఆర్.ఆర్.స్ట్రీట్‌లోని ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తోంది. అదే దుకాణంలో పనిచేస్తున్న మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండేది. ఈ క్రమంలో అతను వివాహం చేసుకునేందుకు నిరాకరించడం, అతడి తరపు బంధువులు యువతిని దూషించడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కాగా నగీనా కొత్త సెల్‌ఫోన్ కొనివ్వాల్సిందిగా తల్లి భానును అడిగితే, ఆమె ఒప్పుకోనందుకు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని సోదరి తస్లీమ్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు.

## మిల్లర్‌లో ఇరుక్కుని వ్యక్తి మృతి



హరినాథ (ఫైల్)

**గాలివీడు :** పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మిల్లర్‌లో ఇరుక్కుని తలారి హరినాథ(33) అనే వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన గాలివీడులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అరవీటి వాండ్లపల్లెకు చెందిన బుడ్డా రామచంద్ర కుమారుడు బుడ్డా సోమశేఖర్ తన పొలంలో దుక్కులు చేయడానికి చిలకలూరిపేటకు చెందిన తలారి ఆదినారాయణ కుమారుడు తలారి హరినాథను పిలుచుకున్నాడు. బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో సోమశేఖర్ తన ట్రాక్టర్‌కు మిల్లర్ పెట్టి పొలం దున్నసాగాడు. అయితే ట్రాక్టర్ కు మిల్లర్ అమర్చి దున్నడంలో అనుభవం లేకపోవడం, అజాగ్రత్త కారణంగా మిల్లర్‌ను రివర్స్ చేస్తున్న సమయంలో గమనించకుండా రావడంతో హరినాథ మిల్లర్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. జరిగిన సంఘటనపై ఏఎస్ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేశారు.

## నా బిడ్డను అప్పగించండి

**రాయచోటి :** కిడ్నాప్‌కు గురైన 15 సంవత్సరాల వయస్సు ఉన్న తన బిడ్డను తనకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని బాలిక తండ్రి మంతెనయ్య జిల్లా ఎస్పీని కోరారు. అనంతరం గురువారం రాయచోటిలో పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. కలికిరి మండలం, మర్రికుంటపల్లి గ్రామం, నడింపల్లికి చెందిన మంతెనయ్య కిడ్నాప్‌కు గురైన తన రెండో కుమార్తె (15)ను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశానన్నారు. కలికిరిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తన కుమార్తెను మరికుంటపల్లి పంచాయతీలోని పెద్దపల్లికి చెందిన వేణుగోపాల్ కుమారుడు అశోక్ (17) చాలా రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తుండేవాడన్నాడు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 31వ తేదీ అశోక్ తన మిత్రులు, బంధువులు ఎస్ లింగయ్య, కమలమ్మ, మల్లికార్జున, లలితమ్మ, సురేంద్ర, ఆనంద్, రూప, రేఖ, పి నాగమ్మ, వి సవితల సహకారంతో ఇంటిలో ఉన్న తమ కుమార్తెను బలవంతంగా తీసుకెళ్లారన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి



మృతి చెందిన చిన్నయ్య

**పీలేరు రూరల్ :** గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు - రాయచోటి జాతీయ రహదారి వెంకటాద్రిళ్ల వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం తీతవగుంటపల్లె పంచాయతీ ఇర్రివాండ్లపల్లెకు చెందిన ఇ. చిన్నయ్య (30) ద్విచక్రవాహనంలో గురువారం రాత్రి పీలేరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వెంకటాద్రిళ్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

## అక్రమాలపై ప్రశ్నిస్తే కేసు

### – జనసేన నాయకుడిపై సొంత పార్టీ నేత నిర్వాకం

**రాయచోటి :** రైల్వేకోడూరులో జనసేన నాయకుల అక్రమాన్ని ప్రశ్నించినందుకు అదే పార్టీకి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. మైసూరువారిపల్లెలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా కొందరు యువకులు క్రీడా మైదానం కావాలని అడిగారు. దీనికి ఆయన స్పందించి ఎకరా కొనుగోలు చేయమని, డబ్బు తాను ఇస్తానని హామీ ఇచ్చారు. బాధ్యతను జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రతో పాటు మరో నాయకుడికి అప్పగించారు. వీరు రూ.20 లక్షలు విలువైన స్థలాన్ని రూ.60 లక్షలకు కొనుగోలు చేసినట్లు చెప్పి రూ.40 లక్షల మేర నొక్కేశారు. ఈ విషయమై జనసేన రాష్ట్ర నాయకుడు హరి రాయల్ ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కూడా ఇది వైరలైంది. ఈ నేపథ్యంలో కన్నెర్ర చేసిన తాతంశెట్టి నాగేంద్ర గత నెల 19న పోలీసులకు వేరే రూపంలో ఫిర్యాదు చేశారని, దీంతో తనపై తప్పుడు కేసు నమోదైందని హరి గురువారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అక్రమాలపై మాట్లాడితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు.

## ఎస్‌సీఎస్‌హెచ్‌జీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**రాయచోటి టౌన్ :** ఎస్‌సీఎస్‌హెచ్‌జీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా డీఆర్‌డీఏ వెలుగు శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 48 మంది ఎస్‌సీఎస్‌హెచ్‌జీ సభ్యులకు జీవనోపాధి కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ కో- ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ లిమిటెడ్) రుణాలు అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన ( పీఎంఏజేఏవై) పథకం ద్వారా రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు రూ.50 వేలు సబ్సిడీతో పాటు 10శాతం వాటా ధనం కింద రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## అర్హులందరికీ దీపం పథకం

**రాయచోటి టౌన్ :** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దీపం-2 పథకం కింద గ్యాస్ సిలిండర్ అందజేస్తారని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 33 మంది ఈ దీపం -2 పథకం కింద సిలిండర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. అందులో 21 సిలిండర్లు అందజేశామన్నారు. ఉచిత సిలిండర్ పొందేందుకు ప్రతి ఒక్కరూ యాక్టివ్ ఎల్పీజీ కనెక్షన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉంటే చాలన్నారు. సిలిండర్ కోసం బుక్ చేసుకోగానే వారి మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. కొందరు తమకు మెసేజ్ రావడం లేదని ఫిర్యాదు చేస్తున్నారన్నారు. దీని కోసం 1967కు ఫోన్ చేసి ఫోన్ నంబర్, రేషన్ కార్డు నంబర్, ఎల్పీజీ నంబర్, ఆధార్ కార్డు నంబర్ చెబితే వెంటనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

### చోరీపై కేసు నమోదు

**ఓబులవారిపల్లె :** ముక్కావారిపల్లి గ్రామంలోని ముక్కా భాస్కర్ రెడ్డి, ముక్కా సుబ్రమణ్యం రెడ్డిల ఇళ్లల్లో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ పి.మహేష్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాస్కర్‌రెడ్డి ఇంటి తలుపులు బద్దలుకొట్టి దొంగలు ఆరు తులాల బంగారం దొంగిలించారు. అదే విధంగా కింది ఇంటిలో తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. అలాగే పక్కన ఉన్న ముక్కా సుబ్రమణ్యం రెడ్డి ఇంట్లో కూడా చోరీ చేశారు. దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### యువకుడి ఆత్మహత్య



ఉరివేసుకొని మృతి చెందిన యువకుడు

**నందలూరు :** మండలంలోని పొత్తపి గ్రామంలో నువ్వుల సతీష్ (25) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఇంటిలోకి వెళ్లిన యువకుడు రెండు రోజులుగా బయటకు రాలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో బంధువులకు ఫోన్ చేయడంతో వారు వెళ్లి ఇంటిలోకి చూడగా సతీష్ ఆత్మహత్య చేసుకొని ఉండటం కంటపడింది. మృతుని తల్లిదండ్రులు జీవనోపాధికోసం కువైట్ దేశానికి వెళ్లారు. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని మృతుడు సూసైడ్ నోట్ రాసి ఉంచాడు. సంఘటన స్థలానికి స్థానిక పోలీసులు చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## అమ్మమ్మపై హత్యాచారం కేసులో జీవితఖైదు



నిందితుడిని జైలుకు తరలిస్తున్న ముదివేడు పోలీసులు

**కురబలకోట/రాయచోటి టౌన్ :** సొంత తల్లికి తల్లి (అమ్మమ్మ) అయిన 90 ఏళ్ల వయో వృద్ధురాలిపై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన కేసులో చిత్తూరు జిల్లా కోర్టు న్యాయమూర్తి శాంతి గురువారం సంచలన తీర్పునిచ్చారు. వావి వరసలు, వయో భేదం మరచి మృగంలా ప్రవర్తించిన నిందితుడు ఇంద్ర ప్రసాద్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ రమేష్ తెల్పిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు క్రాస్ గ్రామం సద్దికూటివారిపల్లెకు చెందిన ఇంద్ర ప్రసాద్ (30) తాగుడుకు అలవాటు పడ్డాడు. సైకోలా ప్రవర్తించసాగాడు. ఇతని ప్రవర్తన, వైఖరి సరిగ్గా లేనందున భార్య కూడా ఇతన్ని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో 2018 ఏప్రిల్, 6న ఇతని తల్లి జె. ఈశ్వరమ్మ పొలానికి వెళ్లింది. ఆమె తల్లి పులగింటి కృష్ణమ్మ (90) వయో వృద్ధురాలు కావడంతో ఇంటి వద్దే ఉండేది. ఈశ్వరమ్మ పొలం పనులకు వెళుతూ తల్లిని జాగ్రత్తగా చూస్తుండమని కొడుకు ఇంద్రప్రసాద్‌కు చెప్పి వెళ్లింది. తిరిగి ఆమె పొలం నుంచి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఆమె తల్లి దుస్తులు చెదిరిపోయి కన్పించాయి. ఆమె సున్నిత భాగాల నుంచి రక్తం రావడం గమనించింది. ఆపై చనిపోయి ఉండటం చూసి నిశ్చేష్టురాలైంది. ఇంట్లోనే ఉన్మాదిలా కూర్చుని ఉన్న కొడుకు ప్యాంటుపై రక్తపు మరకలు పసిగట్టింది. పరిస్థితి గుర్తించిన ఆమె ఒక్కసారిగా భయంతో కేకలు వేసింది. ఇరుగుపొరుగు వారు రావడంతో నిందితుడు పరారయ్యాడు. కొడుకుపై ఈశ్వరమ్మ ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ముదివేడు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఆరేళ్ల పాటు చిత్తూరు జిల్లా కోర్టులో కేసు నడిచింది. పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి ఎస్.శాంతి నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు. మిగిలిన సహజ జీవితమంతా కూడా జైలులోనే శిక్ష అనుభవించేలా తీర్పు వెలువడినట్లు తెలిపారు. నిందితుడిని పోలీసులు జైలుకు తరలించారు.

## రెవెన్యూ అధికారులు అన్యాయం చేశారు

**గాలివీడు :** తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారంటూ ఓ వృద్ధుడు ఆరోపించాడు. గురువారం పెద్దూరుకు చెందిన వృద్ధుడు తన సొంత భూమి రికార్డును రెవెన్యూ అధికారులు సవరణ చేయాలని కోరాడు. ఇందుకు అధికారులు లంచం ఇవ్వాలని కోరినట్లు ఆరోపించాడు. భూమికి సంబంధించిన సరైన రికార్డులు ఉన్నా, అధికారులు అన్యాయం చేస్తున్నారని చెప్పాడు. ఈ సంఘటనపై తహసీల్దార్ భాగ్యలతను వివరణ కోరగా గాలివీడు మండల కేంద్రంలో 497 సర్వే నంబర్‌లో వారి కుటుంబ సభ్యుల పేరిట 2.55 ఎకరాలు ఉందని 496 సర్వే నంబర్‌లో వాగు పొరంబోకు 49 సెంట్లు ఉందన్నారు. ఈ ప్రభుత్వ భూమిని రికార్డు పరంగా స్వాధీనం చేయాలని ఒత్తిడి తెస్తున్నాడని తెలిపారు. అతని వద్దనుంచి ఎలాంటి లంచం తీసుకోలేదని చెప్పారు.

## మండల మీట్‌లో ప్రొటోకాల్‌కు తిలోదకాలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు బాలసుబ్రమణ్యం

**సుండుపల్లె :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం భారీ పోలీసు బందోబస్తు నడుమ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ప్రొటోకాల్‌తో నిమిత్తం లేకుండా ఇతరులకు పెద్దపీట వేయడం చర్చనీయాంశమైంది. ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, మండల ఉద్యానశాఖ అధికారి వనిత, మాచిరెడ్డిగారిపల్లి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ సరోజ తదితరులు మాట్లాడారు. సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐలు శ్రీనివాసులు, భక్తవత్సలం, మోహన్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు

**రాయచోటి అర్బన్ :** అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తదితర సమస్యలపై ఈనెల 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పోతగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన సీపీఎం కార్యకర్తలతో కలసి ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామచంద్ర, నాగరాజ, రమణయ్య, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీలో బ్యాట్స్‌మన్ జోరు



డింకూ రామ్‌చరణ్, అనంతపురం (126 పరుగులు)



వివేకానంద, శ్రీకాకుళం (178 పరుగులు)

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీల్లో బ్యాట్స్‌మన్ సత్తా చాటారు. వైఎస్ఆర్‌ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుంటూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 89.3 ఓవర్లలో గుంటూరు జట్టు 276 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని డింకూ రామ్‌చరణ్ 126 పరుగులతో రాణించాడు. అభినవ్ డేవిడ్ 48 పరుగులు చేశాడు. అనంత బౌలర్ రోహిత్ 4 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

**చెలరేగిన సిక్కోలు జట్టు..**

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో శ్రీకాకుళం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 447 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.వి.ఎస్. వివేకానంద 151 బంతుల్లో 27 ఫోర్లు, 1 సిక్సర్‌తో 178 పరుగులు చేశాడు. ఈయనకు జతగా నేత్రా కిరణ్ 75 పరుగులతో రాణించాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

**కేఓఆర్ఎం మైదానంలో..**

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు 78.3 ఓవర్లలో 286 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భానుచంద్ యాదవ్ 75 పరుగులు, తమన్‌సాయి 60 పరుగులు చేశారు. విజయనగరం బౌలర్లు మణిధర్మతేజ 2, జహీరుద్దీన్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది.

## మాజీ ఎంపీ డీఎన్‌రెడ్డి సతీమణి మృతి

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని అంకాలమ్మ గుడి ఎదురుగా నివాసముంటున్న మాజీ ఎంపీ దివంగత డీఎన్‌రెడ్డి సతీమణి లక్ష్మీదేవమ్మ (95) అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని తన కుమారుడు రమణారెడ్డి వద్ద ఆమె ఆరు నెలలుగా ఉంటున్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# నమ్మండి.. ఇది హార్సిలీహిల్స్!

- పర్యాటక కేంద్రంపై పారిశుధ్యం అధ్వానం
- ఎక్కడి చెత్త అక్కడే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన ముగ్గురు కార్మికుల తొలగింపు



హార్సిలీహిల్స్ గాలిబండ వద్ద తొట్టి నిండిపోయి పైకి కనిపిస్తున్న వ్యర్థాలు

**బి.కొత్తకోట :** బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఎక్కడిచెత్త అక్కడే నిల్వ ఉంటూ దుర్గంధం వెదజల్లుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హార్సిలీహిల్స్‌ను పట్టించుకోవడం పూర్తిగా వదిలేశారు. దీని ఫలితంగా ఇక్కడి పరిస్థితులపై పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హార్సిలీహిల్స్‌పై ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణలో మేటిగా నిలిచింది. ఒక ప్రత్యేకమైన స్థానం కల్పించింది. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశాలు తరచూ నిర్వహిస్తూ ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరించడం జరిగేది. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం హార్సిలీహిల్స్‌పై నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. కొండపై గత ప్రభుత్వం ముగ్గురు పారిశుధ్య కార్మికులను నియమించి ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేయిస్తూ చెత్త, వ్యర్థాలను వెలుపలికి తరలించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిని తొలగించారు. దీంతో ప్రస్తుతం హార్సిలీహిల్స్ పారిశుధ్య పరిస్థితులు అత్యంత దారుణంగా నెలకొన్నాయి. కొండపై పేరుగాంచిన ఆహ్లాదకరమైన ప్రాంతం గాలిబండ. ఇక్కడ వ్యర్థాలు, చెత్తను నిల్వ చేసిన తర్వాత తొలగించేలా తొట్టెను నిర్మించారు. పారిశుధ్య పనులు పూర్తిగా వదిలేయడంతో కొండపైన, గాలిబండపైన ఈ తొట్టిలో వ్యర్థాలు నిండిపోయి కంపుకొడుతూ చూసేందుకు జుగుప్స కలిగించేలా ఉంది. తొట్టి నిండిపోయి వ్యర్థాలు పైకి కనిపిస్తూ దుర్గంధం వెదజల్లుతున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. పర్యాటకులు గాలిబండపైకి వెళ్లకుండా అదే దారిలో ముక్కు మూసుకొని వెళ్తున్నారు. ప్రభుత్వం మారగానే ఇలాంటి దయనీయమైన పరిస్థితులు నెలకొనడంపై పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.